# బోన్సాయ్

గీతాంజలి



**ఊర్మిళకి ఊపిరి ఆడనట్టయ్యింది. ఉలిక్కిపడి లేచింది. రాత్రి రెండు గంటలయ్యింది. ముఖానికి పట్టిన చెమటని కొంగుతో తుడుచుకుంటూ పక్కకి చూసింది. భర్త హాయిగా నిద్రపోతున్నాడు. అతని మొఖం ఎంత ప్రశాంతంగా ఉంది? తనముఖం కనీసం నిద్రలోనైనా ప్రశాంతంగా ఉంటుందా? తనకు తాను చూస్కోలేదు కాబట్టి భర్త సుధాకర్‌ని అడగాలనుకుంది. అసలు తను రాత్రి నిద్రలేచి తన ముఖాన్ని చూస్తాడా?**

గుండెలోని అగ్ని పర్వతాల ఛాయల్ని తన మొఖంలో కనిపెట్టలేని వాడు తన మొఖాన్ని నిద్రలోనే కాదు మెలకువలోను ప్రశాంతంగా ఉందంటాడు. అవును మరి! తన అసంతృప్తినీ, నిరాశా నిస్పృహల నీలి నీడల చిత్రాల్ని పొరపాటున గుర్తుపట్టినా అది తన ప్రశాంతతకే భంగం కదా. పట్టించుకోనట్లుగా ఉండటంలోనే అతనికి సౌఖ్యం ఉంది.

ఊర్మిళకు నిద్రపట్టలేదు. మెల్లిగా లేచి కిటికీ దగ్గరకు వచ్చింది. బయటి నుంచి చల్లని వెన్నెల గదిలోకి వస్తోంది. దానికితోడు చల్లటిగాలి ఊర్మిళ కిటికీలోంచి బయటకు చూసింది. ఆమె దృష్టి బాల్కనీలో పూలకుండీలోని బోన్సాయ్ మఱ్ఱిచెట్టు మీద పడింది. ఆధునిక వృక్షశాస్త్రజ్ఞుల చేతుల్లోపడి తన విశాలతను, స్వేచ్ఛనూ, ఆకారాన్నీ కోల్పోయి భూమాత చల్లని ఒడి నుంచి దూరం చేయబడి - ఒక చిన్న కుండీలో కుదించుకుని మరుగుజ్జుతనాన్ని అనుభవిస్తూ - వెన్నెల్లో తళతళ మెరుస్తూ దీనంగా కన్పించిందా బోన్సాయ్ మఱ్ఱిచెట్టు. రెండ్రోజుల క్రితమే సుధాకర్ ఇష్టపడి కొనుక్కొచ్చి బాల్కనీలో ఉంచాడు. చెట్టు ఆకులపై మంచుబిందువులు దాని కన్నీళ్ళలో ఉన్నాయి. ఊర్మిళ ఒక్క క్షణం ఉలిక్కిపడింది. గుండె దడదడలాడుతోంది. ఈ బోన్సాయ్ చెట్టే కదూ ఇందాక కలలోకి వచ్చి తననంత ఒణికించింది.

ఆమెకు కల గుర్తుకు వచ్చింది. తను నీలాకాశంలో స్వేచ్ఛగా ఎగురుతోంది. తన చేతిలో ఎం.ఎస్.సి., ఎం.ఫిల్, పట్టాలు ఉన్నాయి. తన మొఖంలో ఎంత ప్రశాంతత ఆత్మ విశ్వాసం! తను ఒక కాలేజి ముందు ఆగింది. అక్కడ పిల్లలకు వృక్షశాస్త్రం బోధిస్తోంది. ఎంతో ఆత్మ విశ్వాసంతో అక్కడ తనొక ప్రొఫెసర్. ఆ సీను మారిపోయింది. మళ్ళీ తను ఎగురుతోంది. హాయిగా చల్లని గాలిలో తేలుతూ మేఘాలతో కబుర్లాడుతూ స్వేచ్ఛగా...ఒక ఇంటిముందు తను ఆగింది. అది తన పుట్టిల్లు. బయట బోర్డు మీద ప్రొఫెసర్ ఊర్మిళ, ఎం.ఎస్‌సి, ఎం.ఫిల్ అని ఉంది. బోర్డు తళతళ మెరుస్తోంది. తను లోనికి వెళ్ళింది. అమ్మ నాన్న తమ్ముడు, చెల్లి నవ్వుతూ భోంచేస్తున్నారు. తనూవాళ్ళతో కల్సింది. మళ్ళీ దృశ్యం మారింది.

ఈసారి ఆకాశంలో అమ్మా, నాన్న తమ్ముడూ, చెల్లీ ఎగురుతున్నారు. మెల్లిగా ఒక ఇంటి ముందు ఆగారు అందరూ. అమ్మానాన్న తనని ఇరువైపులా పట్టుకున్నారు. ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. లోపల తన భర్త, అత్త, మామ, మరిది, ఆడపడుచులు ఉన్నారు. తను లోపలికి నెట్టివేయబడింది. తన కొంగు నిండా నోట్ల కట్టలు, ఒంటి నిండా బంగారు నగలు, చేతిలో నలిగిపోయిన ఎం.ఎస్‌సి. ఎం.ఫిల్ పట్టాల సర్టిఫికేట్లు. తలుపులు మూస్కున్నాయి. తను ఆ ఇంట్లో అటు ఇటూ తిరుగుతోంది. బెడ్ రూమ్‌లోని నిలువెత్తు అద్దంలో తనని తాను చూస్కోంది. తన రూపం పూర్తిగా మారిపోయినట్లుగా స్పష్టం చేస్తోంది అద్దం. ముఖం సంతోషంగా లేదు. కళ తప్పి ఉంది. తన జుట్టు స్వేచ్ఛగా ఎగురుతూ లేదు. నూనె రాచి గట్టిగా అల్లి ఉంది. తన కొంగు గాలిలో రెపరెపలాడ్డం లేదు. భుజం మీదుగా నడుం చుట్టూ ఆవరించి పిన్నీసు పెట్టి ఉంది. అరె! ఈ ఇంటికొచ్చేముందు తనకు రెక్కలుండాలే! కత్తిరించేశారు.

> **తను బోన్సాయ్ చెట్టుగా మారి విలవిలలాడుతోంది. ఆ చెట్టు ప్రతీ అణువు నుంచి రక్తకన్నీరు స్రవిస్తోంది. సుధాకర్ అతని కుటుంబం తన చుట్టూబడి ఎంత బాగుందో అని మురిసిపోతున్నారు. తనకి ఒళ్ళంతా చెమటలు పట్టి మెలకువ వచ్చేసింది. స్పృహలో ఊర్మిళకు మళ్ళీ చెమటలు పట్టాయి.**

తను వంటింట్లోంచి బాత్‌రూంలోకి, బాత్‌రూంలోంచి బెడ్‌రూంలోకి, బెడ్‌రూంలోంచి మళ్ళీ వంటింట్లోకి ఇలా నిరంతరాయంగా తిరుగుతూనే ఉంది. తన చేతిలో గరిటా, అంట్లు తోమే కొబ్బరి పీచు, బట్టలుతికే బ్రష్షు ఉన్నాయి. అవి తన చేతులకి అతుక్కుపోయాయి. తను వీటిని గట్టిగా పీకెయ్యాలని చూస్తోంది. రక్తం వస్తోంది. కాని అవి మాత్రం ఊడి రావటం లేదు.

అరే అదేంటి! తను అంత పొడుగుండాలే! ఇంత పొట్టిగా అయిపోయాను! తను కుదించుకుపోతోంది. తన నోట్లోంచి వృక్షశాస్త్ర విషయాలు ధారాళంగా వెలువడేవి. ఇపుడు తనకేమీ గుర్తుకురావటం లేదు. ఇడ్లీలు, దోశలు, పెసరట్లు, ఉప్మాలు, మటన్‌కూరా, చపాతీలు, ఏరియల్, రిమ్ము, ఇస్త్రీ బట్టలూ ఈ పదాలు అలవోకగా వచ్చేస్తున్నాయి.

తను బోన్సాయ్ చెట్టుగా మారి విలవిలలాడుతోంది. ఆ చెట్టు ప్రతీ అణువు నుంచి రక్తకన్నీరు స్రవిస్తోంది. సుధాకర్ అతని కుటుంబం తన చుట్టూ నిలబడి ఎంత బాగుందో అని మురిసిపోతున్నారు.


తనకి ఒళ్ళంతా చెమటలు పట్టి మెలకువ వచ్చేసింది.

ఊర్మిళకు మళ్ళీ చెమటలు పట్టాయి. ఎదురుగా బాల్కనీలో బోన్సాయి మఱ్ఱి ఆచేతనంగా కన్పిస్తోంది. ఆమె నిర్వేదంగా వెనక్కి వచ్చి మంచంపై కూర్చుంది. కూతురు శ్వేత ప్రశాంతంగా నిద్రపోతోంది. రేపు ఇది కూడా తనలాగే....ఊహించుకుంటూనే ఒణికిపోయింది. నిద్రపోతున్న రెండేళ్ళ శ్వేత చేతిలో గరిటె, కొబ్బరి పీచు కన్పించినట్లయి కంపించిపోయింది. ఊర్మిళ తల విదిలించి కూతురుని అదుముకొని పడుకొంది.

ఎన్ని కలలు కంది తను? ఎంత కష్టపడి చదివింది? మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన తను ఎంతో నిరాడంబరంగా పెరిగింది. చిన్నప్పట్నుంచీ తనకు టీచింగ్ అంటే చాలా ఇష్టం. స్కూల్లో సెల్ఫ్ గవర్నమెంట్ డే రోజున తను టీచర్‌గా మారి ఎన్నో బహుమతుల్ని గెల్చుకుంది. తండ్రి తన ఇష్ట ప్రకారమే చదివించాడు. బి.ఎస్‌సి దాకా చదివించి ఇక తన వల్ల కాదని చేతులెత్తేస్తే తనే ట్యూషన్లు చెప్తూ ఎం.ఎస్‌సి ఆ తర్వాత ఎం.ఫిల్ పూర్తి చేసింది. ఆ తర్వాత ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరింది. ఎంత సంతోషం వేసిందో ఆ రోజు. నాన్నకు ఆ వయసులో తను ఎంతో ఆసరాగా నిల్చింది. తను టీచింగ్‌లో మంచి లెక్చరర్‌గా పేరు పొందింది. తన ప్రతిభకు

మెచ్చి జీతమూ పెంచారు. అనుకోకుండా సుధాకర్ తననొక పెళ్ళిలో చూడ్డమూ, వాళ్ళమ్మా నాన్న తన తల్లిదండ్రులని సంప్రదించడమూ, పెళ్ళికి అంగీకారం కుదరడం, నాన్న తను ఏళ్ళ తరబడి కూడబెట్టిన డబ్బంతా ధారపోసి తన పెళ్ళి సుధాకర్‌తో జరిపించెయ్యడమూ అన్నీ అతివేగంగా తన ప్రమేయమేమీ లేకుండా జరిగిపోయాయి. పెళ్ళంటే తనకు అయిష్టం లేకున్నా పెళ్ళి తర్వాత ఉద్యోగం మానెయ్యాలన్న వాళ్ళ షరతు తన్ను కదిలించింది. తను ప్రతిఘటించే సమయం వచ్చేటప్పటికే అన్నీ జరిగిపోయాయి. మౌనంగా అంగీకరించక తనకు వేరే మార్గం లేకపోయింది. సుధాకర్ వాళ్ళు స్థితిమంతులు, స్వంత ఇల్లు, క్లాస్-1 ఉద్యోగం ఇవన్నీ మధ్య తరగతి ఏ తండ్రిని లొంగదియ్యవూ? ఇలా తను ఈ ఇంట్లోకి వచ్చి చేరింది. ఊర్మిళ వైవాహిక జీవితం ఏ అనుభూతులు లేకుండా నిర్వికారంగా సాగుతోంది. ఈ జీవితం ఊర్మిళను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తను కోరుకున్న జీవితం కానేకాదు. తను కోరికలు వేరు. తన ఆకాంక్షలు వేరు. వాటిని చంపుకోనూ లేదు, ఆచరణలో పెట్టనూ లేదు. సుధాకర్‌తో ఎన్నోసార్లు చెప్పిచూసింది. అమ్మకిష్టం లేదని అంటాడే తప్ప తనకిష్టం ఉందో లేదో చెప్పడు.

ఇక్కడ జీవిస్తున్న జీవితం తనదికాదు. తన శ్వాస మీద అధికారం ఇంకొకరిది. తను ఏ రంగు చీర కట్టాలి? ఏం నగ పెట్టుకోవాలి? ఎక్కడికెళ్ళాలి? ఎక్కడికెళ్ళద్దు? ఎవరితో మాట్లాడాలి? ఎన్ని గంటలకి లేవాలి? ఏం చేయాలి? ఇవన్నీ తనకోసం మరొకరు నిర్ణయించాలి. తను మరోమాట లేకుండా చెయ్యాలి. తన విద్యార్హత, తన ప్రతిభ వీరికి గడ్డిపోచతో సమానం. చపాతీలు పొరలు పొరలుగా ఎలా ఒత్తాలి, ఛాయ్ కమ్మగా ఎలా చెయ్యాలి, ఇంటిని శుభ్రంగా ఎలా ఉంచాలి. సుధాకర్ మాసిపోయిన తెల్లచొక్కా ఎలా తెల్లగా మెరిపించాలి. వీటిల్లోనే తన ప్రతిభని చూడాలనుకుంటారు. పెళ్ళికి ముందు సాకారం పొందిన తన కల పెళ్ళి తర్వాత నిరాకారం అయిపోయింది. ఓ కలగా కూడా మిగలలేదు. అణచివేయబడిన తన ఆకాంక్ష జ్వాలగా మారి తనని కాలుస్తోంది. రోజు రోజుకూ అది దావానలం అవుతోంది. తను తానుగా బతకాలి. ధ్వంసం చేయబడిన తన జీవితం తిరిగి చిగురించాలి. ఎవరి కోసమో తను కుదించుకుపోకూడదు. తను ఓ మానవ బోన్సాయ్‌గా పూర్తి పరివర్తన చెందేకంటే ముందే తన్ని తాను బతికించుకోవాలి. తన జీవితంలో చైతన్యం నిండాలి. తన జీవితం నిత్యం క్రియేటివ్ వర్క్‌తో బిజీ అయిపోవాలి. ఊర్మిళ అలా ఆలోచిస్తూనే మదనపడుతూ ఉంది. తూర్పు తెల్లవారడం ఊర్మిళ గమనించి కీ ఇచ్చిన యంత్రంలా ఒక ఉదుటున లేచి పనిలో నిమగ్నమైంది.



**ఊర్మిళ వైవాహిక జీవితం ఏ అనుభూతులు లేకుండా నిర్వికారంగా సాగుతోంది. ఈ జీవితం ఊర్మిళను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తను కోరుకున్న జీవితం కానేకాదు. తను కోరికలు వేరు. తన ఆకాంక్షలు వేరు. వాటిని చంపుకోనూ లేదు, ఆచరణలో పెట్టనూ లేదు...ఇక్కడ జీవిస్తున్న జీవితం తనదికాదు. తన శ్వాస మీద అధికారం ఇంకొకరిది.**

సుధాకర్ ఆఫీసుకి వెళ్ళేటపుడు బోన్సాయ్‌కి నీరు పట్టించడం మర్చిపోవద్దని మరీ మరీ చెప్పి వెళ్ళాడు. పనంతా అయ్యాక కాసేపు టి.వీ చూద్దామని ఆన్ చేసింది. తన భర్త తెల్లచొక్కా మీది మరకను కన్పించకుండా మాయం చేసిన సబ్బు గురించి ఒకావిడ తెల ఎపొగుడ్తూ భర్తంటే ఎంతిష్టమో ఈ సబ్బంటె అంతిష్టం అంటోంది. ఊర్మిళకి టి.వీ చూడాలన్పించలేదు. ఆఫ్ చేసింది. పాపకి అన్నం పెట్టి పడుకోబెట్టి నీళ్ళు తీస్కుని బాల్కనీలోకి వెళ్ళింది. బోన్సాయ్‌కి నీళ్ళు పోసింది. తనని చూసి బోన్సాయ్ నవ్వినట్లయి ఉలిక్కిపడింది ఊర్మిళ. బోన్సాయ్‌కి నీళ్ళు పోస్తున్న తను కూడా క్షణాల్లో కుదించుకుపోయి మరుగుజ్జు అయినట్లనిపించింది ఊర్మిళకు. నీళ్ళు పోయడం ఆపి బెడ్‌రూమ్‌లో పడుకొని కళ్ళు మూస్కుంది. "నన్ను తీసుకెళ్ళి పెరట్లో భూమిలో పాతు - ఆకాశమంతా విస్తరిస్తాను. నీకు చల్లని నీడనిస్తాను. నన్ను ఈ ఇరుకు కుండీ నుండి విముక్తం చెయ్యవూ" అని బోన్సాయ్ మర్రి ఆక్రోశించినట్లు అన్పించింది ఊర్మిళకు. మరుక్షణం బీరువాలో అడుగున ఉన్న గుడ్డలో చుట్టిన మూట బైటకి తీసింది. అందులో తన సర్టిఫికేట్ల ఫైలు, హెర్బేరియమ్, డిసర్టేషన్ పుస్తకాలు ఉన్నాయి. సర్టిఫికెట్లు చూసింది. అన్నీ ఫస్టు మార్కులే. హెర్బేరియమ్ - ఎంత ఓపికగా పోగు చేసిందో ఈ రకరకాల వృక్షజాతుల్ని! ఎన్ని అభినందనలు లభించాయి తనకి? ఇప్పటికీ ఏమి మించిపోలేదు. తను పనిచేసిన కాలేజీలో ఇప్పటికే ఉద్యోగం తన కోసం రెడీగా ఉంది. మొన్న సినిమా హాల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ కన్పిస్తే "ఏమ్మా! హౌస్‌వైఫ్‌గా సెటిల్ అయిపోయావా! నీ టాలెంట్ అంతా వేస్టేనా. పాప పెద్దదైందిగా - వచ్చి మళ్ళీ జాయిన్ అవరాదూ - నీలాంటి బ్రిలియంట్ అండ్ ఎఫీషియంట్ లెక్చరర్స్‌కి మన కాలేజీలో ఎపుడూ స్థానం ఉంటుంది. యూ ఆర్ మోస్ట్ వెల్‌కమ్" అని సుధాకర్‌వైపు తిరిగి "సుధాకర్‌గారూ! మీ విద్యార్థులకు ఊర్మిళ అవసరం ఎంతో ఉంది. ప్లీజ్ ఎంకరేజ్ హర్!" అని వెళ్ళిపోయాడు. సుధాకర్ మొఖం నల్లగా అయ్యింది. సినిమా హాల్లో ముభావంగానే ఉండిపోయాడు. ఆ రోజు రాత్రి తమ మధ్య జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది ఊర్మిళకి. ప్రిన్సిపాల్ ఇచ్చిన స్ఫూర్తితో సుధాకర్‌తో ఉద్యోగం విషయం ప్రస్తావించింది.

"నేను జాబ్‌లో జాయినవ్వాలనుకుంటున్నాను. ప్రిన్సిపాల్‌గారు కూడా సానుకూలంగానే ఉన్నారు"

"నీకెన్నో సార్లు చెప్పాను. ఉద్యోగం ప్రసక్తి తీసుకురావొద్దని ఇంట్లో ఎంతో పని ఉంటుంది. నువ్వు ఉద్యోగానికి వెళ్తే ఇంటి పనెవరు చూస్తారు? పనంతా మా అమ్మ మీద వదలడం ఏం భావ్యం? అయినా మనకేం తక్కువయ్యిందని నువ్వు ఉద్యోగం చెయ్యాలి?" ఇంతకుముందు ఎన్నోసార్లు మోగిన రికార్డు మళ్ళీ మోగుతోంది.

"సంపాదన కోసం కాదు. నా చదువు, నా ప్రతిభ, నా జ్ఞానం, టీచింగ్ చెయ్యాలన్న నా చిన్ననాటి ఆకాంక్ష సాకారం కావాలని" ఊర్మిళ జవాబు సుధాకర్‌ని కదిలించలేకపోయింది.

"టీచింగ్ పట్ల ఉన్న నీ ఆసక్తిని శ్వేతకు చెప్పుకోవడం ద్వారా తీర్చుకో"

"మీ సలహాకి కృతజ్ఞతలు. కాని నేను నా ఆంబిషన్స్‌ని చంపుకోలేకపోతున్నాను. నేను జాయినవుతాను" స్థిరంగా అంది ఊర్మిళ. సుధాకర్ తెచ్చిపెట్టుకున్న ఓపిక పటాపంచలయ్యింది.

"పెళ్ళికి ముందే కండిషన్ పెట్టాము - నువ్వు ఉద్యోగం మానెయ్యాలని" కోపంగా అన్నాడు.

"నన్నడిగారా?" అసలు నేను ఉద్యోగం ఎందుకు మానెయ్యాలి? పెళ్ళికి ముందు నేను ఉద్యోగం చేసాను. తర్వాతా చెయ్యాలనుకున్నాను. అమ్మా నాన్న కోరిక మేరకు తాత్కాలికంగా ఆపినా శాశ్వతంగా మానెయ్యాలని నేనెపుడూ అనుకోలేదు. ఇపుడు చేస్తాను. అప్పటిదాకా నాకు శాంతి లేదు"

తన స్థిర చిత్తం చూసి జడిసిపోయాడేమో మరింక ఏం మాట్లాడక మొఖం గంటు పెట్టుకొని అటు తిరిగి రాత్రంతా దూరంగా పడుకున్నాడు. అప్పట్నుంచే ఇద్దరి మధ్య కోల్డ్‌వార్ మొదలయ్యింది. సుధాకర్ కంటె తనకి విద్యార్హతలు ఎక్కువ. తనలా ఉద్యోగం చేస్తూ హుందాగా ఉండడం ఆయనకు కడుపు మంట. ఇంట్లో తనకి సేవలు చేస్తూ పడి ఉంటే అతని ఇగో తృప్తి పడ్తుంది. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే అతని ప్రేమ ఉంటేనేం? ఊడిపోతేనేం? తనకి ఆత్మగౌరవం ముఖ్యం. తనకిష్టం లేని పని ఇంక ఎంతమాత్రం చెయ్యదు. చాలు! ఈ శరీరం మనస్సు చాలా అలసిపోయాయి. అసలు ఈ శరీరం తనదేనా? ఈ చేతులు తన శరీరానికి సంబంధించినవేనా? తనకోసం పనికిరాని ఈ చేతులు తనవెలా అవుతాయి? తన నుదుటిరాతను మార్చడానికి ఈ చేతుల్ని ఉపయోగించాలి. అపరిచితులుగా మారిపోయిన ఈ చేతుల్ని తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలి. మనసు కూడా అంతే! రుచులు, అభిరుచులు అన్నీ మర్చిపోయింది. సుధాకర్ రుచులే తనవి, అతని అభిరుచులే తనవీ, తిండి, బట్టా, వేషం, భాష అంతా సుధాకర్‌కి ఇష్టమైన రీతిలో సాగాలి. తన యాసలో మాట్లాడితే

వెక్కిరింత. ఊర్మిళ సర్టిఫికెట్ల ఫైలు బయటపెట్టి మిగతావి బీరువాలో సర్దేసింది. బోన్సాయ్ మర్రి ఊర్మిళను వెంటాడుతోనే ఉంది. ఆ చెట్టు తన జీవితానికి ప్రతీకలా ఉంది. బోన్సాయ్ మర్రి తనకొక అబ్సెషన్‌గా మారిపోయింది. రెండ్రోజులు అలానే గడిచిపోయాయి ఊర్మిళకు. ఆ రోజు సుధాకర్ బోన్సాయ్‌కి ఎంతో ఆపేక్షతో నీళ్ళు పోస్తున్నాడు. ఊర్మిళ నిర్లిప్తంగా బాల్కనీలో ఎటో చూస్తూ నిల్చుని ఉంది.

"ఎంత బాగుందో బుజ్జిముండా" మురిసిపోయాడు. "ఏం బాగుంది! విశాలంగా విస్తరించాల్సిన చెట్టుని - భూమి గుండెల్లో నిండుకోవాల్సిన చెట్టుని - ఆకాశానికి, భూమికీ వేరే చేసి దాని పరిధిని కుదించి ఇంట్లో అలంకరణ వస్తువుగా వాడుకోవడంలో ఏం అందం ఉంది! ఆటవికత తప్ప "తనలో అనుకున్న మాటలు అసంకల్పితంగా బయటికే అనేసింది.

"ఏం ఊర్మిళా అలా మాట్లాడుతున్నావు?" ఆశ్చర్యపోతూ అడిగాడు సుధాకర్. ఒంట్లో బాగోలేదా?

"నాకేమయ్యింది. ఒంట్లో బాగానే ఉంది" విసుగ్గా అంది ఊర్మిళ. ఊర్మిళ సుధాకర్ మాటలు వినడం లేదు. తీక్షణంగా బోన్సాయ్ వేపే చూస్తోంది. ఉన్నట్టుండి ఆమె బోన్సాయ్ చెట్టుని కుండీతో సహా చేతుల్లోకి తీస్కుంది.

"ఏంటది ఊర్మిళా! ఏం చేస్తున్నావు?" సుధాకర్ మాటల్ని పట్టించుకోకుండా వేగంగా కదలి పెరట్లోకి వచ్చింది. ఒక రాతి మీద కుండీని బాది చెట్టుని బయటికి లాగింది. ఇనుప చువ్వతో గోతిని తవ్వి బోన్సాయ్‌ని అందులో పెట్టి మట్టిని కప్పేసింది. పాదులు చేసి నీరు పోసింది. ఆ పని ఆమె ఎంత శ్రద్ధతో చేసిందంటే ఆమె ముఖంలోని తీక్షణతకి సుధాకర్ భయపడిపోయాడు. తృప్తి నిండిన మొఖంతో నుదుట పట్టిన స్వేదాన్ని తుడుచుకుంటూ "దీని స్థానం ఇక్కడ" అని చూపుడు వేలితో నేలవైపు సూచించింది సుధాకర్‌ని ఉద్దేశించి.

"కాని ఇక్కడ బోన్సాయ్ నిలుస్తుందో లేదో"...సుధాకర్ మాటలు పూర్తికాకుండానే ఊర్మిళలోనికి వెళ్ళిపోయింది. మర్నాడు ప్రొద్దున సుధాకర్‌తో పాటు తనూ తయారయ్యింది. సుధాకర్ భృకుటి ముడివేశాడు.

"కాలేజీకి" సమాధానం ఇచ్చింది ఊర్మిళ. ఫైలు పట్టుకొని బయటికి వెళ్ళిపోయింది. నోరెళ్ళ బెట్టిన సుధాకర్, అత్తమామలు చూస్తూ ఉండిపోయారు. ఆమె నిర్ణయానికి తిరుగులేదు. రెండు సంవత్సరాలుగా ఆమె అనుభవించిన వేదనాభరితమైన ఘర్షణకి తెరదించేసింది. పెరట్లో బోన్సాయ్ మొక్క వస్తుందో రాదో ఆమెకి తెలీదు. తను మాత్రం మానవ బోన్సాయ్ కాకుండా విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టింది నింగికి నేలనీ విస్తరించడానికి.

# ఆత్మీయత రుచి తెలిపిన అనుభవం

## జ్వాలాముఖి జ్ఞాపకం

హైదరాబాదులో సీతారాంబాగ్ దేవాలయం30 ఎకరాల ప్రహరీకోట- అక్కడే నా పుట్టుక (1938), పెరగడం- అక్కడ ఆలయాలతోపాటు సంస్కృతపాఠశాల వుండేది. అదే తర్వాత ఉభయవేదాంత వర్ధన్ సంస్కృత పాఠశాలగా అభివృద్ధి చెంది తిరుపతి దేవస్థానం ద్వారా ఈనాడు (బేగంపేట) నడుస్తూవుంది. పాఠశాల కెదురుగా కోనేరు. దాన్ని అందరూ పురుగుల బావి అనేవారు. ఒకనాడు అందులోకి ఓ పొడువాటి పాము వచ్చింది. ఆలయ కాపలదారు మీసాల ఠాకూరు దీన్ని చూశాడు. దాన్ని అందులోంచి తీయడానికి కఱ్ఱ ఉరిలాంటిది తయారుచేశాడు. పాము వచ్చే చోట వదిలాడు. పాము ఈదుతూ బావిలో ఉరిలోకి రాగానే తాడు లాగాడు. కట్టిన తాడు తెగిపోయింది. పాము అలాగే వుండిపోయింది. పాము ఈదుతూ ఓ మూలకు చేరుకోగానే తోకను పట్టి బలంగాపైకి విసిరాడు. దాదాపు పదడుగులపైన ఓ మిద్దె మీద నేను మిగతా పాఠశాల విద్యార్థులతో పాటు పాము ఉదంతాన్ని చూస్తున్నాను. ఠాకూరు విసిరేసిన పాము సరిగ్గా వచ్చి నా మెడలో నే పడింది. వెనువెంటనే "నీ యవ్వ" అని దాన్ని మెళ్లోంచి తీసి కింద పడేశాను. అది పక్క మోరీలోంచి కిందకి జారింది. వెంట పడి కాపలాదారు దాన్ని చంపేశాడు. ఇక పాఠశాల విద్యార్థులు, వీధిలోని వారు ఆలయ ఉద్యోగులు నా చుట్టూ చేరారు. మా అమ్మ పాముల విషయంలో చాలా ధైర్యశాలి. ఎన్నో పాములు ఇంట్లోకి రాగా వెదకి చంపేది. మా నాన్నకు పామంటే భయం. అమ్మకు ధైర్యం పోయింది. నేనంటే పంచ ప్రాణం చేసే మా అమ్మమ్మ ఊరంతా ఒకటి చేసింది. ఏడ్చి పెడబొబ్బలు పెట్టింది. మా నాన్న పొట్టతిప్పలకోసం దేశసంచారం వెళ్లి వున్నారు.



పోగైన జనం నన్ను ఏమీ తిననీయలేదు. నిద్రపోనీయలేదు. ఒకవైపు మంత్రాలు, మరోవైపు ప్రార్థనలు, ముడుపులు. నన్ను పాము కరిచిందని అందరి అనుమానం. పాముకు విషంలేదని, అది తాటి జెర్రి కానీ త్రాచుపాము కాదని కొందరి ధృవీకరణ. సంఘటన మధ్యాహ్నం 3-4 గంటలమధ్య జరిగింది. పొద్దుగూకింది. అప్పట్లో నేను బొద్దుగా ముచ్చటగా వుండేవాణ్ణి. కొందరు 'డబుల్ రోటీ' అంటే ఇంకొందరు 'ముద్దపప్పు' అనేవారు. నన్ను ఆ రాత్రంతా నిద్రపోనీయలేదు. నిద్రపోతే విషమెక్కుతుందని అందరి అనుమానం. నాకప్పుడు సరిగా పదేళ్లు వున్నాయో, లేదో జ్ఞాపకంలేదు. పాము కాటువేసింది లేనిదీ ధృవీకరించుకోవడానికి వళ్లంతా చూశారు. ఎక్కడా గాట్లు కానరాలేదు. తాటి జెర్రి తోకతో కొడుతుంది. అది చాలు, అన్నారు కొందరు. వళ్లంతా ఉప్పు పసుపు కలిపిననీళ్లతో కడిగారు. పాము కరిచిందీ లేనిదీ ధృవపరచుకోవడానికి నాచేత వేపాకు తినిపించారు. కరిస్తే చేదు అనిపించదట. ఎండు మిరపకాయలు తినిపించారు. కారం వేయదట. కానీ, నాకు చేదు, కారం తెలిశాయి. మా అమ్మమ్మ పడ్డ బాధ మొక్కిన మొక్కులు చెప్పరానివి. [illegible]జానికి ఆమె మా అమ్మకు పినతల్లి(తల్లి చెల్లెలు)- ఆమెకెవరూ మిగల లేదు. నా మీద ఈగవాల నిచ్చేదికాదు. నన్ను మొదటిసారి పి.డి.చట్టంకింద నిర్బంధించినప్పుడు (1971) ప్రభుత్వాన్ని తిట్టిపోసింది. నా విడుదలకు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసింది. ఇప్పుడామె లేదు. నా బాల్యానికి ఆమెకు తీరని బంధంవుంది. ఆమె వంటకం, టీ చాలా రుచిగా వుండేవి. ఆమెపేరు రామానుజమ్మ. దయార్ద్ర హృదయురాలు. ఆస్తిగలది. దాయాదులు మోసంచేశారు. ఆ రాత్రంతా అందరూ వందదాకా భజనలు చేస్తూ నన్ను నిద్ర పోనీయలేదు. తేపతేపకు వేపాకు తినిపించేవారు. విషం ఎక్కదని తలంచేవారు. "తినుబిడ్డా తర్వాత చక్కెర తిందువుగానీలే" అని మా అమ్మమ్మ ఏడుస్తూ వేపాకు తినిపించేది. పదేళ్లవాడినైన నాకు అందరూ ఏడుస్తుంటే నాకు ఏడుపొచ్చేది. తర్వాత పామును విసిరిన ఠాకూరు పహరా డ్యూటీ చేస్తూ వచ్చాడు. "పాముకు ఉరిబిగిసి వుంది. అది కరవజాలదు. అయినా, అది తాటి జెర్రి. త్రాచుపాము కాదు" అని హిందీలో చెప్పి నా వీపు చరిచాడు. మర్నాడు తెల్లవారగానే ఆ కోనేట్లోనే అమ్మమ్మ తీసుకుపోగా మునిగాను. సీతారామస్వామి, వరదరాజస్వామి దర్శనం చేసుకున్నాను. అర్చన చేశారు. దేవుళ్ల పూలహారం నా మెళ్లో వేశారు. పాము కారణంగా ఆనాడు అందరి ఆత్మీయతను పొందాను. అలాంటి ఆత్మీయత ఈనాడు కరువైంది. తోటివారిని పట్టించుకోవడం ఫ్యూడల్ సమాజ ఔన్నత్యం. ■

## చలం 'ఆలోచనలు' నుంచి...

చాలా సులభంగా ('సింపుల్'గా) ఎట్లా వెలువడితే అట్లా 'సింపుల్'గా వ్రాయి. మాటమీద మనసుని వృథా చేసుకోకు. అక్షరంపైన ఆలోచన నిలుపకు. ఈ నాటి కవుల శక్తి నాజూకైన శబ్దాల, అర్థంలేని మెలికల్లో, వెతుకుళ్ళలో, మెరుగుల్లో ఇంకిపోతుంది. ప్రజలందరూ చదవడానికి వ్రాస్తున్నావు. ప్రజలందరూ మాట్లాడే భాషని వ్రాయి. గొప్ప మాటలనీ; నీచపు మాటలనీ, నిర్దుష్టమైన శైలి అనీ, మలినమైనదనీ, రెండు లేవు. చెప్పేదేదో సూటిగా, స్పష్టంగా, చెప్పగల మాట, శైలీ ఇవే ఉన్నాయి. చెప్పేది దిట్టంగా సంపూర్ణంగా తెలిసేట్టు చెప్పెయ్యి. ఏది ఆలోచిస్తున్నావో అది సరిగా నిజంగా ఆలోచించు. నిజంగా నువ్వు దేన్ని అనుభవించావో అది నిజంగా అనుభవించు. నీ హృదయంలోని లయ (రిథం)నే వ్రాతల్లో కనపడనీ! ఆత్మశైలి!!